పేరంటం

పూడిపెద్ది వెంకటరమణయ్యగారు

పసుబూ కుంకానికీ పిలువవచ్చిన జానకిని చూచి రాజమ్మ నివ్వెరపడ్డాది. ఆమె కట్టుకున్న సేలంపట్టు చీర దీపపువెలుగులో తళ తళ లాడుతూంది. ఊదా, మెఱుపూ, పట్టంచులు జలతారుపువ్వులతో జిలజిలలాడుతున్నాయి. పైట చెరగు కమ్మిలో జల్తారు మొలనున్న మువ్వలవడ్డాణంతో ముచ్చటిస్తూంది. మెడలో హారాలవరసలు చీరపట్టంచులతో పంతా లాడుతున్నాయి. చేతుల గాజులూ, చేతిలో వెండిభరిణా, వ్రేళ్ళ ఉంగరాలూ ఇవన్నీ చూచి రాజమ్మకన్నులు మిలమిలా మెరిసేయి. జానకిని చూచి పేద నవ్వు నవ్వింది. జానకి మొలలో చేతిరుమాలు తీసికొని పౌడరుపూతలో మొగం మెల్లగా అద్దుకుంటూ,

“మీఆయన ఊళ్లో ఉన్నారా?” అంది.

రాజమ్మ—ఊళ్లోనే ఉన్నారు. ఎక్కడకో వెళ్లేరు. ఇంకా ఇంటికి రాలేదు.

జానకి—సరే, వెళతా మమ్మా—ప్రొద్దుపోయిందా? ఇంకా ఊరంతా పిలవాలి. అన్నట్టు రాజమ్మా, నీ వెప్పుడూ మాయింటికి రానే లేదు. రేపు తప్పకుండా రావాలి. ముత్తైదువవు గదా, పేరంటానికీ రాకూడదా? వస్తావా?

రాజమ్మకన్నులు కొంచెంచెమ్మగిల్లేయి.

“అలాగేనమ్మా! మీ రన్నిసార్లడగాలా?”

జానకి “నీవుండమ్మా, మేము వెళతాం” అని వెళ్లిపోయింది. రాజమ్మ వంటింట్లోకి వెళ్లి ఉడుకుపట్టిన అన్నం పదును చూస్తూంది.

రాఘవయ్య మెల్లగా లోన ప్రవేశించి చిఱునగవుతో, “ఏమేవ్ రాజ్యం! రేపు డాబుకొట్టే వన్నమాటే! పేరంటం, విందూ, పాటలూ, వాయనాలూ! ఓ! రేపు సందడంతా మీఆడువాళ్లదే! ఎప్పుడూ ఇలా ఇంట్లో కూర్చుంటే ప్రపంచం ఎలా చూస్తావు? వెల్లోకమాటూ! నీకేం మాట రాదా? మంతి రాదా? మర్యాదా మప్పితం ఎఱుగవా?” అన్నాడు.

రాజమ్మ— అయ్యో! ఎఱుగకపోవడమేమీ? అన్నీ మెఱుగుదును ఏమీ తెలియకుండా ఇంతదాన్నెలా అయ్యేను! పెంటచ్చిలాగు నేను వెళ్లి అక్కడ నిలబడితేనే గాని వాళ్లింట పేరంటకం సాగదు. కలకలలాడేవాళ్లమధ్య నొకదిష్టిబొమ్మ ఉండొద్దూ?

రాఘవయ్య—ఎందు కలా అంటావూ? వాళ్లందరిలోనూ నీపాటి అందమైన ఆడుది ఒక్కర్తె ఉందీ? నీ ముందే వాళ్లందరూ దిష్టి

బొమ్మల్లా గుంటారు. నీ వెప్పుడేనా అద్దం దగ్గర నిలబడి నీరూపం పరీక్షించుకున్నా ?

రాజమ్మ—అద్ద మెక్కడ? ఇంతకీ ఏలా పరీక్షించుకోడం ? దిన్నబోయిన విగ్రహాన్ని చూచుకొని మరింత దిగులుపడడానికా!

రాఘవయ్య కొంచెం చిన్నపుచ్చుకున్నాడు. ఔను పాపం! చెప్పడానికి తగిన దొక్కనగైనా ఈమెకు లేదు. చేతులకు నల్లనివి రెండుపట్టుగాజులూ, మెడలో పచ్చని బొందూ, రెండుపుస్తెలూ, చెవులకు రెండుకటకంపూలూ, చిన్న మెఱ్ఱుపొడిముక్కుపుడకా- పుణ్యస్త్రీలక్షణాలు చెడకుండా ఆమె కున్న నగలివే! ఇంట్లో నిత్యమూ కట్టుకోడానికి రెండు గువ్వకన్నుచీరలూ, తొడుక్కోడానికి రెండు బొంబాయితూలురవికలూ—వీనిని విడిచి ఆమె కేమీ సింగారాలు గాని, చీరమడతలు గాని లేవు. పేరంటానికి వెళ్లంటే యెలా వెళుతుంది? ఏంచీర కట్టుకుంటుంది? ఏం నగలు పెట్టుకుంటుంది? ఈసంగతు లన్నీ తట్టగానే రాఘవయ్యమనస్సు చివుక్కుమంది. ఏం చేస్తాడు పాపం! ఠాణాలో అతని కిచ్చే పాతిక రూపాయీలతోనూ జీవనం గడవడమే కష్టమయిపోతూంది, అట్టే ఆలోచించేడు.

“రాజ్యం! ఇంత సౌందర్యవంతురాలివి నీవే యిలా బాధపడుతూఉంటే పుట్టెడేసి లోపా లున్నవా ళ్లందరూ యెలా పరితపించాలో! కాంతాలోకానికి భూషణానివైన నీకే భూషణాలకోసం ఇంతతహతహా?”

రాజమ్మ—అయితే మీరుకూడా రేపు నాతో రండి. ఈ బట్టుముక్కలు నాలుగూ అక్కడ ఏకరవుపెడుదురు గాని...నా గువ్వకన్నుచీర చూస్తే వాళ్లగుండెలు పగిలిపోతాయి. వెడవెడపోతూన్న యీనాతూలు రవిక చూస్తే వాళ్లందరూ తూలి పడిపోతారు...పోనిస్తురూ, నాలాంటిదానికి పేరంటం ఏమిటి? ఎంత చేసుకుంటే అంతే గాని యెక్కువ రమ్మంటే యెలా వస్తుంది? మీకే యెక్కువగా డబ్బుంటే మీరే నన్ను పెళ్లాడకపోయియుందురేమో. నాపెండ్లికోసం పాపం, మానాయన ఎన్నిబాధలు పడ్డాడు! ఎందరికాళ్లు పట్టుకున్నాడు! పేదవానికడుపున పుట్టడంచేత గదా న న్నేగొప్పవాళ్లూ చేసుకున్నారు కారు? మీధర్మమా అని మీ రంగీకరించేరు గాని, మాలాగే ఉన్నా మీరు కాస్త బల్లోకి వెళుతున్నా రనేగర్వం చేత మీనాయనగారు కట్నంకోసం కళవళపడ్డారు కారూ? ఏలా యిప్పు డవన్నీనీ? నాకు మీతో సుఖంగా కాలక్షేపం వెళుతూంది. ఎక్కడికీ. ఇలాటి కోరికలకు హద్దేమిటి? ఇప్పుడు మిమ్మల్ని బాధపెడితే మాత్రం మీ రెక్కడనుండి తెస్తారూ? ఏ పేరంటకాలూ వద్దూ. ఇలా కాలక్షేపం చేయనిద్దురూ!

రాజ్యంమాటలు వింటూ ఆనందపరవశుడయిపోయేడు రాఘవయ్య. ఆమెతొగరు పెదవుల వణకూ, పెద్దకనురెప్పల తొణకూ, చెక్కుటద్దాల తళుకూ, చికురాల బెళుకూ,

కంఠంసొపూ, చేదీగచూపూ, ఎత్తుఎడదయదరూ, చిన్నినడుంబెదరూ, ఇవన్నీ ఆమెకు విశేషాలంకారాలుగా ఊహించేడు. కాని ఆమె కేమీ నగలు పెట్టలేకపోయేడు గదా అని విచారించేడు. నగలదాకా యెందుకూ, పేరంటానికి వెళ్లినప్పుడయినా కట్టుకుందికి ఒకఖరీదయిన చీరయినా కొనలేకపోయేడు. ఎలా వస్తుంది! నిరుపేదకి నీళ్లూ, అన్నమే పంచభక్ష్యాలున్నూ. రాఘవయ్య అట్టే ఆలోచించేడు.

“ రాజ్యం, రేపు నీ వెలాగయినా పేరంటానికి వెళ్లక తప్ప” దన్నాడు

రాజమ్మ—ఈకుళ్లుగుడ్డలతో నేనా? నేను వెళ్ల లేను సుమండీ! మనదరిద్ర మేదో మనం నాలుగుగోడలనడుమనూ పడుతున్నాం చాలదూ? ఊళ్ల వెంట వెళ్లబొయ్యా లేమిటి?... ఉండండి, అన్నం ఒమిడిపోతూంది.

రాఘవయ్య—రాజ్యం, సత్యవంతులకు పేదరికం విలాసం అవుతుంది. నీలాటి సహజ సౌందర్యవంతురాలికి విశేషభూషణమౌతుంది. జ్ఞానుల కది స్వర్గతుల్యమే. దరిద్రం పాపం కాదు గదా?

రాజమ్మ—పేరంటానికి వెళ్లి పేదరికం మీద లెక్చరిచ్చేదా యేమిటి?

రాఘవయ్య—అది కాదు. నీకు నచ్చ చెబుతున్నాను.

రాజమ్మ—నా కేలా నచ్చచెప్పడం? ఈదరిద్రం నా కివాళ క్రొత్తగా వచ్చిందా యేమిటి? వేయిమంది గొప్పవాళ్లల్లో ఒక పేదరాలి నెవరు చూస్తారు? ఎవరు పలుకరిస్తారు? ఎవరు లక్ష్యంపెడతారు?

రాఘవయ్య—వాళ్లందరూ చూచి మాత్రం నీ కేం చెయ్యాలి? కావ్యాలు వ్రాస్తారా, కనకాభిషేకం జేస్తారా? అంత అలాగు ముస్తాబులయి వచ్చినవాళ్లకయినా యేం చేస్తారు? పట్టుచీర కట్టుకోడానికి పేదరికం గాని పసుబూ కుంకానికీ పేదరికమా? ఇంతకీ నే నేదో చీర తెచ్చి యిస్తాను కదూ; నేను చెప్పినట్టూ ముస్తాబయి వెళుదూ, నిన్నెవ రేమంటారో చూస్తాను.

రాజమ్మ పకపకా నవ్వింది.

౨

సీతమ్మ చిత్రకారుని రంగులనాడెపుపలకలాగు, సీతాకోకచిలుకరెక్కలాగు రంగు రంగుల చీరా, రంగురంగుల రవికా, నల్లని మొగం, తెల్లనిపౌడరూ, ఊదాకుంకుమబొట్టూ, ఎఱ్ఱని ముక్కుపుడకా, తెల్లనిపండ్లూ, పచ్చని నగలూ వీనితో తళతళలాడుతూంది.

నాగమ్మ ఒక్కటే గొలుసూ, ఒక్కటే గాజుల జతా, ఒక్కటే ముక్కు పుడకా, ఒక్కటే ఉంగరం, మెలిపడ్డ ముంగురులూ, మెడనిండా పౌడరు, భుజా లంటిపోయిన రవికా, ముంజేతిమీదికి పైటా, కాలికి పట్టీల జతా, కట్టడపు సవరపు వ్రేల్జడా, వీనితో, రూపం మెలా ఉన్నా లోపం లేదన్నట్టు త్రిప్పుకుంటూంది.

శ్యామల కట్టుకున్నది గానో గాగ రావో, చీరో పంచో, తెలియదు; కొంచెం మిాగాళ్లు దాటి గూడారులాగు వ్రేలాడుతూంది; భుజాల కెగసిపోయిన పొట్టిచేతుల కచ్చా దానికి కుట్టినట్టుంది. మొలకు తెల్లని పట్టీ. ఆపట్టీలోనుండి మొలచినట్టు పై కెగసిన మూరెడు పైటచెరగూ; ఆచెరగు కుచ్చెళ్లన్నీ కూడబెట్టి యెడమభుజం కొనను, మిలమిలా మెరసే కల్లపొళ్ల సూదిలో నిమిడ్చింది. సన్నని వెండిపట్టీలు రెండు సగం పాదాలమిాదికి జారవిడిచింది. చీపురుపుడకలలాటి బంగారుకడియాలు రెండుమండలమిాదికీ దొరలిపోతున్నాయి. తలవెంద్రుకలాటి బంగారు తీగెతో అల్లిన గొలుసు పైటమిాద కదులుతూంది.

సుందరమ్మా, చెంప కొప్పూ, పండ్ల కప్పూ, మొగంనిండా పసుపూ, ముద్దగన్నేరు రేకులాటి బొట్టూ, చెవులపువ్వులూ, చేతులకు గుత్తంగా నల్ల గాజులూ, ముందుకు మురుగులూ, ముక్కున హంసా, నీలిరవికా, తూలుచీరా, కాళ్ల నందెలు కడియాలూ గొలుసులూ, కళ్లనిండా కాటుకా, కట్టినట్టి పాపట బొట్టూ, కాలి వ్రేళ్లకు మట్టెలూ, కొప్పులో గన్నేరుపువ్వూ, బుగ్గను తాంబూలం, వీనితో వెనుకటి కాలాన్ని తలపిస్తూంది.

మంజరి, సేలం చీరా, మధుర రవికా, పుదుచ్చేరి గొలుసులూ, బెంగుళూరు గాజులూ, చెన్నపట్నం ముక్కుపుడకా, సీమకమలాల దుద్దులూ, ప్యారిస్ ముత్యాలదండా, వీనితో అన్ని దేశాలనుండీ అలంకారాలు సేకరించుకుంది.

కమలమ్మా, కట్టుకాసులపేరూ, గజ్జల వడ్డాణం, పలకసరిపేటలూ, పదిపేటల గడియారపు గొలుసూ, గజ్జల పట్టెడా, జిగినీ గొలుసూ, చేతికి నాలుగుజతల గాజులూ, పలకల మురుగులూ మురిడీగొలుసులూ, పది వ్రేళ్లకూ ఉంగరాలూ, చెవుల దుద్దులలో లోలక్కులూ, కాలికి కడియాలూ గొలుసులూ, తలమిాద నాగరం, వ్రేల్జడ కొనను నగిషీ జడగంటలూ, చిన్నిబొట్టూ, చేప కొలుకులకాటుకా, వ్రేలికొనలకు గోరంటా, పెదవికి చినాలీరంగు, నెడల్పుజలతారు మైజారు చెరగూ, తామరపువ్వులంతేసి బుటాలచీరా, వెన్నుచుట్టిన జల్తారూ ముఖమలు పూవుల నక్కీచేతులూ గల రవికా వీనితో కండ్లు పులిమినట్టు కలకలలాడుతూంది.

అలంకారవిధానాలకు వీళ్లు తలమాని కాలలాటి వాళ్లు. తక్కినవా ళ్లందరూ వీరి నక్కడక్కడ అనుకరిస్తూ వెలితిపడుతూ వెలవెలబోతూ, అందులో అందులోనే సర్దుకుంటూ అలంకరించుకున్నారు.

ఆనాడు జానకియింటినడువాకిలి ఉద్యానవనంలా గుంది. చిలుకలపంజరంలా గుంది. నవ్వుమొగాలతో పూలచెట్టులాగు విరిసింది. సౌందర్యదేవతకు నాట్యశాల అయింది. ఆ ముత్తైదువలనడుమ జానకి వనదేవతలాగుంది.

అత్తరు దోహదం పెడుతూంది. పన్నీటి తుంపురులు చల్లుతూంది. వారిచేదీగలకొనల తమలపుటాకుగుత్తు లమరుస్తూంది. కోకిలయి పలుకరిస్తూంది. చిలుకయి పలుకుతూంది. తుమ్మెదై త్రుళ్లుతూంది. చకచక లాడుతూంది.

* * * *

అందరిచూడ్కులూ ఒక్కమాటు వీథి గుమ్మంవైపు మరలేయి. "ఊఁహూ" అని, "అబ్బో" యని, "ఏమి టీవింత" అని, ఇలాంటిమాటలు మెల్లమెల్లగా వెడలేయి. రాజమ్మ వెనుకనుండి మరలించిన పైటచెరగు చేతులతో పట్టుకొని లేతగా నవ్వుతూ, తాపీగా నడుస్తూ, లలితంగా కనురెప్ప లల్లాగుస్తూ, సిగ్గుచేత చెక్కిలొత్తుకుంటూ, వేదరికం తలచుకొని పెదవి వడకిస్తూ, నలుగురు మధ్యకూ వచ్చి నిలుచుంది. అందరు పేరంటాళ్లూ ఆమె నట్టే మెగాదిగా చూచేరు. తలంటి నీళ్లు పోసుకున్న జుట్టు నున్నగా దువ్వుకొని వ్రేలుముడి వేసికొంది. తెల్లని నందివర్ధనం పువ్వు ఒక్కటే ఆ ముడిమీద నమర్చుకుంది. మొగాన్న చిన్ని కుంకుమపుబొట్టు చిఱునవ్వు నవ్వుతూంది. కన్నుల కాటుకరేకలు కలువ రేకులను తలపిస్తున్నాయి. చెక్కులతళుకులలో సింధూర రేఖలు తారులాడుతున్నాయి. కంఠంలో యేదో కదలుతూన్నట్టు కనిపిస్తూంది. ఖద్దరు రవిక చేతులనుండి వ్రేలాడే అరటి దూటలలాటి ఆమెచేతులు సంగోగు మలచి మెరుగుపెడుతూన్న చంద్రకాంతశిలావిగ్రహాన్ని తలపిస్తున్నాయి. వక్షంమీది పైటలో పసుపుబొందు పైకి కనబడడానికి సిగ్గుపడుతూంది. వాడిన పొగడపూలదండ పలపలా పరిమళిస్తూంది. ఆదండతో దంశలయి ఖద్దరుపైట మడతలు కదలుతున్నాయి. గోరంచు గోధుమరంగు ఖద్దరుచీర మెత్త మెత్తగా బరువు బరువుగా మడతలుపడి కుచ్చెళ్లు పాదాలను ముద్దుపెట్టుకుంటున్నాయి. అందరూ ఒక్కమాటుగా ఆశ్చర్యం పై కొలికించేరు.

'రండి, రండి', 'కూర్చోండి, కూర్చోండి' అని అందరూ అన్నారు. అందరికంటే ఆమెతో కొంచె మెక్కువపరిచయము గల కామాక్షి నిలువలేక యెదురుగా వెళ్లి ఆమెను కౌగలించుకొంది. కొంచెం వయస్సు మళ్లిన కనకమ్మకన్నులు చెమ్మగిల్లేయి. రాజమ్మను చూచి జానకి పొంగిపోయింది. ఎదురుగా వెళ్లి ఆమె సౌందర్యాన్ని అట్టే కౌగలించుకొని తోడ్కొని వచ్చి ఆమెను తివాచీమీద కూర్చుండబెట్టింది.

ప్రొద్దు వాలింది. పేరటాండ్రెవరూ కదలలేదు. రాజమ్మను చూస్తూ, మెచ్చుకుంటూ ముచ్చటిస్తూ మాటాడిస్తూ అలా కూర్చున్నారు. సంధ్యారాగ మలమింది. రాజమ్మ చెక్కులు గులాబిమొగ్గలు తొడిగేయి.

రాజమ్మ—ప్రొద్దుపోయింది జానకమ్మగారూ, వండుకోవాలి. ఇక శల విప్పిస్తారా?

జానకమ్మ—ఉండండీ, వెళుదురు గాని.

చంద్రోదయం అయింది. సంధ్యారాగం వైరాగ్యం పూని సాత్వికంలో పడ్డాది. రాజమ్మ చెక్కులు మల్లెపూలు విరుస్తున్నాయి. ముత్తైదువ లొక్కరొక్కరే లేచి వెళుతున్నారు. "నేను వెళుదునా!" అంది రాజమ్మ. "ఇదిగో వస్తున్నా"అని జానకి లోపలినుండి బదులు చెప్పింది. అమ్మలక్క లందరూ వెళ్లేరు. రాజమ్మ అలా నిలబడ్డది. జానకి దాసీ చేతికి పళ్లెమూ లాంతరూ ఇచ్చి, "రామీ, రాజమ్మగారిని వారింటికి దిగబెట్టిరా" అంది. "వెన్నెలా, లాంత రెందుకూ" అంది రాజమ్మ. "ఉండనిద్దురూ" అంది జానకి.

వీధిగుమ్మములో రాజమ్మ చేతికి పళ్లెమందించి, "అమ్మా, చెలవా"అని రామి వెళ్లిపోయింది. చావటిలో దీపందగ్గర కూర్చొని రాఘవయ్య ఏదో నవల చదువుకుంటున్నాడు. అదే ధ్యానంతో చూస్తూన్నాడేమో, గుమ్మంలో అడుగులచడి కాగానే అటు చూచేడు. "రాజ్యం" అన్నాడు.

రాజమ్మ—వచ్చాను. అబ్బ! ఆమె యెప్పటికీ వదిలింది కాదు! దులుపుగో వచ్చేస్తే బాగుండదు. వండుకోలేదు. పాపం! ఇవాళ మీకు భోజనం ఆలస్యం చేసేశాను. ఇందుకే యెక్కడకు వెళ్లడమన్నా నే నిష్టపడను.

రాఘవయ్య—ఇప్పు డేమయింది? ఏమిటాపళ్లెంలో?

కప్పుతువాలు తీసి చూచేడు. నాలుగు పెద్ద లాడూఉండలూ, నాలు గరటిపళ్లూ, పిడికె డాకులూ చెక్కలూ, పసబూ కుంకుమా ఉన్నాయి. రాఘవయ్య వానిని పరీక్షించి రాజమ్మముఖం చూచేడు. రాజ్యం కలకలలాడుతూంది. దీపపువెలుగున తళతళలాడుతూంది. అత్తరుపన్నీరువాసనలతో ఘుమఘుమ లాడుతూంది. వంట కాలేదని తహతహ లాడుతూంది. రాఘవయ్యాహృదయం విరిసిపోయింది. ఒడలు నిలువునా పులకించేసింది. "ఇప్పుడు మఱి వంట చేయకు రాజ్యం! ఈఉండలు పళ్లూ తిని పా (తాగి పడుకుందాం!"

రాజ్యం—అయ్యో!

రాఘవయ్య — అయ్యో యేమిటి? ఇంకా మరి వంట యెందుకూ? నా కక్కర లేదు. నీకు కావాలా?

రాజ్యం—నాకు మొదలే వద్దూ! ఆ జానకమ్మ ఆదరణతో నాకు కడుపు నిండిపోయినట్టుంది.

రాఘవయ్య—చూచేవా? నేను చెప్పినమాట నిజమేనా?

రాజ్యం—నిజమే.

అని పెదవి వడకిస్తూ చేతులు రెండూ జోడించి భర్తకు నమస్కారం చేసింది. చెక్కులమీద ఆనందబాష్పాలు జారేయి. ఆ అవస్థలో రాజ్యం రాఘవయ్యకు సరి క్రొత్తగా కనబడింది. అనుకోకుండా ఆయన చెక్కులమీదకూడా ఆనందబాష్పాలు దొరలేయి. నిలువనీయని వింతఆందోళ నేదో వాని

హృదయం కలచేసింది. ప్రేమతో అతని ప్రతి రాజ్యాన్ని తీక్ష్ణంగా చూచేడు. చేతులు రక్తనాళమున్నా టకటకా కొట్టుకొంది. రెండూ చాచేడు.

అతడు పరవశుడయిన ట్టులా నిలబడ్డాడు. "అయితే, యిలా రా మరీ?" అన్నాడు.

శకుంతల

కె. అన్నమరాజ శర్మగారు

అమ్మ, శైశవమాదిగ నాడుకొన్న
ఈనికుంజాలయంబుల నీమనోజ్ఞ
శాద్వలంబుల కాననస్థలుల విడిచి
చనఁగ నాపాదములు ముందు సాగకుండె.

ఆశ్రమాంతరతరువరేణ్యమ్ములార,
సురభివేళల క్రీడించి సొలసి మీదు
శీతలచ్ఛాయలందు వసించునట్టి
స్మరణరమణీయసౌఖ్యమ్ము మఱవవలసె.

ప్రత్యుషస్సుల కమలాకరమ్ములందు
నంచపిండులతో నడయాడుచుంటి,
పరభృతాంగనలకు మాఱువలుకుచుంటి,
కాని, యవియెల్ల నేఁటితోఁ గలలు కావె.

పిన్నతనముననుండియుఁ బెంచి నోటి
గాయముల మాన్పుచుంటిని గారనూనె,
కన్నతల్లిగ భావించు కారణమున
కాళ్ల బెనఁగొనుచున్న దీ కన్నెలేడి.

గర్భవతియయినకురంగి కన్నపిదప
నాకు శుభవార్త పంపుమా నాన్న, నేను
చూచిపోయెద నీ నిండుచూలునందు [ము.
దయను మఱవకు ననువోలెఁ దలఁచికొను

నెచ్చెలీ, అనసూయ, నే నిండుప్రేమఁ
బెంచి నీరు వోసిన మాధవీకుమారి
బ్రసవసమయంబుదాఁకను బ్రతిదినంబు
ఆదరింపుము వారిని బాదు నింపి.

సఖి, ప్రియంవదా, ప్రియమున సాఁకినట్టి
ఈవనజ్యోత్స్నఁ బోషింప నీవ యింక
పోయివచ్చెద సెలవిమ్ము పొమ్ము మఱలి
ఎంతదూరమ్ము వచ్చిన నేమి కలదు ?

చలికి వెఱవక లేచి యుషస్సులందె
స్నాన మొనరించి యీయేఁటిచాయలందు
చిత్రచిత్రంపు మ్రుగ్గు రచించుచుంటి
మెడఁదలే సాక్షి మన స్నేహవృత్తి కింక.

ప్రాణసములార, దూరస్థురాల నగుచు
పోయివచ్చెద, నాకయి పొగులవలదు;
మాలినీసరిజ్జలముల మఱల మనము
స్నానమొనరించు భాగ్యమెన్నాళ్లకగునో?
ఆర్యసీమంతినీ ధర్మ మాచరించు
చతిథిపూజానిమగ్నత నలరునట్లు
వందనము తండ్రి, దీవింప వందనములు,
ఆశ్రమక్షేమ మెఱిఁగింపు మప్పుడపుడు.